PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 341 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 07 రూ - 03/- గురువారం 05 డిసెంబర్ 2024

## కేంద్రం బీసీల లెక్కలు తేల్చాల్సిందే...



3లో

## ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని రూ. 1000 కోట్లతో అభివృద్ధి



3లో



# ఉద్యోగ, ఉపాధి కల్పనే నా ధ్యేయం

- తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి నా ధ్యేయం
- ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి ఆగదు
- ఉద్యోగాల ఊసే లేకుండా గత పదేళ్ల కాలంలో పాలన
- యువకులను రెచ్చగొట్టేలా బీఆర్ఎస్ వ్యవహరిస్తుంది
- రాష్ట్రాన్ని నిరుద్యోగులు పోరాటం చేసి సాధించుకున్నారు
- వారి ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు
- అన్ని అవకాశాలను నిరుద్యోగులకు చేరువ చేస్తుంది
- ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 54 వేలకు పైగా ఉద్యోగాలు
- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం
- యువకుల్లో వృత్తి నైపుణ్యతను పెంపొందించే చర్యలకు శ్రీకారం
- యువ వికాసం సభా వేదికపై సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- గ్రూప్-4 అభ్యర్ధులకు నియామక పత్రాలు అందజేత

**పెద్దపల్లి,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత తమకే దక్కుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో బుధవారం ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా యువ వికాసం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రత్యేక స్టాల్స్ ను సభ వద్ద ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ లో ఆపరేషన్ గరుడ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, డీ.ఈ.ఈ.టి, ఏ.ఎల్.ఈ.ఏ.పి, టాస్క్, ఎన్.ఎస్.ఐ.సి, న్యాక్, టామ్ కామ్, యువజన క్రీడ శాఖ, సింగరేణి సంస్థ ద్వారా కూడా స్టాల్ ఏర్పాటు చేయగా, ముఖ్య మంత్రి పరిశీలించారు. అలాగే రూ. 1024 కోట్ల 90 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు సీఎం. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ఎందరో నిరుద్యోగులు పోరాటం చేసి సాధించుకున్నారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అవకాశాలను నిరుద్యోగులకు చేరువ చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 54 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించామని, అలాగే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువకుల్లో వృత్తి నైపుణ్యతను పెంపొందించే చర్యలకు శ్రీకారం చుట్టామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో, ఉద్యోగాల ఊసే లేకుండా పరిపాలించిందని, తాము ఉద్యోగాలు ఇస్తుంటే యువకులను రెచ్చగొట్టేలా బీఆర్ఎస్ వ్యవహరించిందన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి తన ధ్యేయమని, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో తమ ప్రభుత్వంపై ఎన్నో దుష్ప్రచారాలు సాగిస్తున్నారని,

వివరాలు 2లో

## మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్



**ముంబై,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత 11 రోజులుగా నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది. మహారాష్ట్ర నూతన సీఎంగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం మహాయుతి కూటమి నేతలు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలవనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎంలు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్ గవర్నర్‌ను కలిసి తమ అభ్యర్థనను వినిపించనున్నారు. ప్రభుత్వ ఏర్పాటు విషయంపై గవర్నర్‌కు వివరించనున్నారు. బుధవారం ఉదయం జరిగిన బీజేపీ

వివరాలు 2లో

## మా కార్యకర్తలు, నాయకులు పోరాటం స్ఫూర్తిదాయకం

- ప్రజా సమస్యల పరిష్కారంలో సింహాల్లా పోరాటం : కేటీఆర్



**హైదరాబాద్,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకుల పోరాటం స్ఫూర్తిదాయకంగా ఉందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కార్యక్షేత్రంలో ప్రతి రోజు కాంగ్రెస్ ప్రభుత్వంతో తలపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలకు, కేసులకు వెరవకుండా సింహాల్లా పోరాడుతున్న మా పార్టీ

వివరాలు 2లో

## పార్టీ కార్యాలయాలకు భూ కేటాయింపులు..

- భూ కేటాయింపులపై న్యాయస్థానంలో విచారణ



**హైదరాబాద్,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు భూ కేటాయింపులపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పార్టీ కార్యాలయాలకు చౌకగా భూములు ఇచ్చారంటూ దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. హైదరాబాద్‌తోపాటు మిగతా జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల కోసం చౌకగా భూములు అమ్మకాలు దక్కించుకున్నారని పిటిషనర్ ప్రస్తావించారు. 500 కోట్లు విలువైన భూమిని కేవలం 5 కోట్లుకు కేటాయించారని వాదించారు. గజం 100 రూపాయలకే కేటాయింపు జరిగినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అధికారులు, జర్నలిస్టులకు భూ కేటాయింపులపై గత నెల 25న ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పుని ఈ సందర్భంగా ప్రస్తావించారు. రెండేళ్లగా ఈ అంశంపై ప్రతివాది మాజీ సీఎం కేసీఆర్ కౌంటర్ దాఖలు చేయలేదని పేర్కొన్నారు. దీనిపై మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ 3 వారాలకు వాయిదా వేసింది హైకోర్టు.



## వణికిన గద్దెలు

- 7.27 గంటలకు స్వల్పంగా కంపించిన భూమి

**ములుగు,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** సమ్మక్క-సారక్క గద్దెలు వణికిపోయాయి. బుధవారం ఉదయం మేడారంలో ఆ తల్లులు గద్దెలపై ఉన్న ఇనుప గ్రిల్స్ కూడా ఉగిపోయాయి. ములుగు జిల్లాలో ఇవాళ ఉదయం 7.27 నిమిషాలకు భూమి కంపించిన విషయం తెలిసిందే. రిక్టర్ స్కేలుపై 5.3 తీవ్రతతో భూమి కంపించింది. సారక్క గద్దె వద్ద ఉన్న కెమెరాకు .. భూ ప్రకంపనలు చిక్కాయి. భూమి ప్రకంపించిన సమయంలో గద్దె వద్ద ముగ్గురు ఉన్నారు. ఓ వ్యక్తి గద్దె వద్ద కూర్చుని పూజ చేస్తుండగా, మరో వ్యక్తి అతని సమీపంలో నిలబడ్డారు. ఓ మహిళ కూడా ఆ గద్దె వద్దే ఉన్నది. భూమి కంపిస్తున్న సమయంలో.. ఆ ముగ్గరూ కొంత ఆందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో వాళ్లకు అర్థం కాలేదు. కొద్ది సేపు అటూ ఇటూ చూశారు. తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో.. గద్దెల చుట్టు ఉన్న గ్రిల్స్ ఊగినట్లు సీసీకెమెరాల ద్వారా స్పష్టమైంది. కెమెరాలు వణికిపోవడంతో.. అక్కడ భూమి కంపించినట్లు అర్థమైంది.



## పురుగుల అన్నం విజయమా?... విద్యార్థుల చావులు ఉత్సవమా? : బండి

**హైదరాబాద్,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ దృష్టిలో పిల్లలకు పురుగుల అన్నం పెట్టడం ఒక విజయమని, విద్యార్థుల చావులు కాంగ్రెసోళ్లకు ఉత్సవమా? కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. యువతకు ఉద్యోగాలివ్వకపోవడం విజయమా?... వారికి సంకెళ్లేయడం ఉత్సవమా? అని ప్రశ్నించారు. రైతులను మోసం చేయడం విజయమా?... వారికి ఉరితాళ్లేయడం ఉత్సవమా? అని బండి నిలదీశారు. ఆడబిడ్డలకు ఆగం చేయడం విజయమా?... వారి కన్నీళ్లతో ఉత్సవం చేయడం గెలుపా? అని అడిగారు. ఇళ్లు ఇస్తామని మోసం చేయడం విజయమా?... ఉన్న ఇళ్లు కూల్చడం ఉత్సవమా? అని చురకలంటించారు. రుణమాఫీ చేస్తామని మాట తప్పడం విజయమా?... అప్పులకు నోటీసులివ్వడం ఉత్సవమా? అని మండిపడ్డారు. ఏడాది అరాచక పాలనే కాంగ్రెస్ విజయమా?... ప్రజల చావులు, గోసలే ఉత్సవమా? అని ధ్వజమెత్తారు. ఇవి విజయోత్సవాలు కాదు వికృత ఉత్సవాలు అని బండి ఘాటు విమర్శలు గుప్పించారు.

## హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్..



**హైదరాబాద్,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో గూగుల్ భారీగా పెట్టుబడుల పెట్టేందుకు సిద్ధమైంది. ఈక్రమంలోనే బుధవారం రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్ మధ్య ఒప్పందం కుదిరింది. సైబర్ సెక్యూరిటీకి హైదరాబాద్‌ను ప్రపంచ రాజధానిగా స్థాపించడానికి గూగుల్ సన్నద్ధమైంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయనుంది గూగుల్.తాజాగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన గూగుల్ ప్రతినిధులు.. ఈ సెంటర్ ఏర్పాటుపై చర్చలు జరిపారు. ఐటీ మంత్రి శ్రీధర్ బాబు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాగా, ఆగస్టు 2024లో గూగుల్ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లిన సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చర్చలు జరిపారు. గూగుల్ మేనేజ్‌మెంట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేలా రేవంత్ సర్కార్ ఒప్పించింది. దీంతో ఆసియా పసిఫిక్ రీజియన్‌లో టోక్యో తర్వాత హైదరాబాద్‌లోనే గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది.

## ఎపి, తెలంగాణలో భూకంపం

**హైదరాబాద్,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో భూమి కంపించింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలతో పాటు ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో స్వల్ప భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ములుగులో రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 5.3గా ఉందని భూపరిశోధన అధికారులు వెల్లడించారు. భూకంప కేంద్ర మేడారంలో ఉందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, జగ్గయ్యపేటతో సహా పలు ప్రాంతాలలో భూమి కంపించడంతో జనాలు భయంతో వణికిపోయి బయటకు పరుగులు తీశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, చర్ల, చింతకాని, నాగులవంచ ప్రాంతాల్లో భూమి మూడు సెకన్ల పాటు కంపించింది. రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం, హయత్‌నగర్‌లో పాటు పలు ప్రాంతాలో భూమి ప్రకంపనలు చోటుచేసుకున్నాయని ప్రజలు తెలిపారు. భూమి కంపించడంతో అపార్ట్‌మెంట్ల నుంచి జనం బయటకు పరుగులు తీశారు.



## రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా దాన కిశోర్

**హైదరాబాద్,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా దాన కిశోర్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న బుర్రా వెంకటేశం వీఆర్ఎస్ తీసుకోవడంతో ఖాళీ ఆయన స్థానంలో దాన కిశోర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా దాన కిశోర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## క్వాష్ పిటిషన్‌కు దాఖలు చేసిన హరీశ్‌రావు

**హైదరాబాద్,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):**మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని హరీశ్‌రావు పిటిషన్‌లో పేర్కొన్నారు. పంజాగుట్ట పీఎస్‌లో తనపై తప్పుడు కేసు నమోదు చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతో ఇచ్చిన ఫిర్యాదు ఆధారం గా కేసు నమోదు చేశారని ఆయన తెలిపారు. నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నా రు. ఎఫ్ఐఆర్‌పై ముందుకు వెళ్లకుండా స్టే ఇవ్వాలని కోర్టును కోరారు. సిద్దిపేట కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హరీశ్‌రావుపై కేసు నమోదైన సంగతి తెలిసిందే.

## నరేందర్‌రెడ్డి క్వాష్ పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు

**హైదరాబాద్,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. లగచర్ల దాడి ఘటనలో ఏ1గా ఉన్న పట్నం నరేందర్ రెడ్డి.. కొడంగల్ కోర్టు రిమాండ్ విధించడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో ఇటీవల పిటిషన్ వేశారు. లగచర్ల ఘటనలో తనపై నమోదైన కేసులను కొట్టివేయాలని కోరారు. పట్నం నరేందర్ రెడ్డి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు దాన్ని తిరస్కరించింది. బెయిల్ పిటిషన్‌పై కింది కోర్టు విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

## చెక్‌పోస్టులలో ఏసీబీ అధికారుల తనిఖీలు

**హైదరాబాద్,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలోని పలు చెక్‌పోస్టుల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు చెక్‌పోస్టుల్లో 7 ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. లెక్కలు చూపని నగదును ఏసీబీ బృందాలు సీజ్ చేశాయి. విష్ణుపురం చెక్‌పోస్టులో రూ. 86,500, భోరజ్(ఆదిలాబాద్) చెక్‌పోస్టులో రూ. 62,500, అలంపూర్ చెక్‌పోస్టులో రూ. 29,200 సీజ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ చెక్‌పోస్టుల్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.

## కౌశిక్ రెడ్డిపై పోలీస్ అధికారి ఫిర్యాదు

**హైదరాబాద్,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బుధవారం మధ్యాహ్నం విధులను అడ్డగించి.. బెదిరించారని ఇన్స్‌పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కౌశిక్ రెడ్డితో పాటు మరో ఇరవై మందిపై కేసు నమోదైంది. తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని కౌశిక్ రెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఆయన వచ్చే సమయానికి సీఐ బయటకు వెళ్తున్నారు. అయితే తన ఫిర్యాదును స్వీకరించిన తర్వాత వెళ్లాలని కౌశిక్ రెడ్డి పట్టుబట్టారు. అయితే తనకు అత్యవసర పని ఉందని, తిరిగి వచ్చాక ఫిర్యాదును స్వీకరిస్తానని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో ఎమ్మెల్యే విధులకు ఆటంకం కలిగించారని, తమపై ఆగ్రహం వ్యక్తం చేశారని ఇన్స్‌పెక్టర్ తెలిపారు. సీఐ పని మీద వెళ్తుండగా ఆయన కారును బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకొని నినాదాలు చేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో సీఐ వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. దీంతో పోలీసులు ఫిర్యాదు చేశారు.

## మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్

(మొదటి పేజీ తరువాయి)

కోర్ కమిటీ సమావేశంలో.. సీఎంగా ఫడ్నవీస్ పేరును ప్రతిపాదించగా.. ఏకగ్రీవంగా ఆమోదించారు. రేపు (డిసెంబర్ 5న) ముంబై ఆజాద్ మైదాన్‌లో ఆయన సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. సీఎంతోపాటు ఇద్దరు ఉపముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం ఉంటుందని స్పష్టం చేశాయి. అజిత్ పవార్‌తోపాటు ఏక్‌నాథ్ షిండే డిప్యూటీ సీఎంలుగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. షిండేకు మరిన్ని కీలక పదవులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇక ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది.



## ఉద్యోగ, ఉపాధి కల్పనే నా ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం వాటికి సమాధానమన్నారు. ఈ కార్యక్రమంలోనే గ్రూప్-4 ద్వారా ఎంపికైన అభ్యర్థులకు యువ వికాసం సభా వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ పాలనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, పదేళ్ల పాలనను.. ఏడాది పాలనను పోల్చి చూడాలని విజ్ఞప్తి చేస్తున్నామని సీఎం రేవంత్ కోరారు. ప్రతిపక్షాల చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే అత్యధికంగా వడ్లు పండిస్తున్న జిల్లా పెద్దపల్లి అని? అన్నారు. ఏడాదిలో 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. మోదీ సీఎం, పీఎంగా ఉంటూ గుజరాత్‌లో ఏడాదిలో 55 వేల ఉద్యోగాలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నియామక పత్రాలు ఇచ్చామని అన్నారు. ఉద్యోగాలపై మాట్లాడాలని మోదీ, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు సవాల్ విసిరారు. వడ్లు పండించమని చెప్పామని, అందుకే మద్దతు ధర, బోనస్ ఇస్తున్నామని చెప్పారు. చాలా ఏళ్ల తర్వాత ఆడబిడ్డల కళ్లలో సంతోషం చూశానని సీఎం రేవంత్?రెడ్డి వ్యాఖ్యానించారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తామని పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలు ఓటేస్తే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శాతవాహన వర్సిటీకి ఇంజినీరింగ్, లా కాలేజీలు మంజూరు చేస్తామని ప్రకటించారు. సీఎం వెంట ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంఛార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటి పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ విప్ లు ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు రాష్ట్ర స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మా కార్యకర్తలు, నాయకులు పోరాటం స్ఫూర్తిదాయకం

(మొదటి పేజీ తరువాయి)

నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మరో నాలుగేండ్లు ఈ పోరాటాన్ని ఉధృతంగా ముందుకు తీసుకెళ్లాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు కొన్ని అబద్దాలు పదేపదే వల్లె వేస్తుంటే బాధ అనిపిస్తుంది. ఒక అబద్దాన్ని వందసార్లు చెప్తే నిజమైపోతదనే నానుడి ఏదైతో ఉందో దాన్ని అనుసరించుకుని ఇవాళ జోసెఫ్ గోబెల్స్‌ను ఆదర్శంగా తీసుకుని ఈ సీఎం, మంత్రివర్గం ప్రయత్నం చేస్తోంది. ప్రజలు, మీడియా దృష్టికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పుల గురించి తెలియజేయాలని ఈ సమావేశం నిర్వహించాం అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నిన్నటికి సంవత్సరం అయింది. బాక్సింగ్ క్రీడలో ఒక సామెత ఉంటది.. ఎంత గట్టిగా పంచ్ విసరగలిగామన్నది కాదు.. ఎంత గట్టిగా పంచ్‌ను విసిరినా తట్టుకుని తిరిగి నిలబడాలన్నది ముఖ్యం. ఇది క్రీడాకారుడికి పరీక్ష. ఆ విధంగా ఈ ఏడాది కాలంలో బీఆర్ఎస్ అనేక ఆటుపోట్లు ఎదుర్కొంది. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలైన, కేసీఆర్‌కు గాయమైనా.. కవితను అరెస్టు చేసి ఐదున్నర నెలలు జైల్లో పెట్టినా, పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించని ఓటమి పాలైనా.. మా పార్టీ జెండా మీద గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరినా.. కేసులు పెట్టినా, అవమానాలకు గురి చేసినా తట్టుకుని నిలబడ్డాం. లగచర్లలో గిరిజన రైతుల పక్షానా నిలబడ్డాం. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పోరుబాట పట్టామని కేటీఆర్ గుర్తు చేశారు. బుధవారం తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్‌గా మారింది. హైడ్రా, మూసీ బాధితులతో పాటు పలువురు క్యూ కడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ బాధితులు తమ వేదనను చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఉండాలి.. తెలంగాణకు కేసీఆర్ శ్రీరామరక్ష అని వాలంటీర్లుగా పని చేస్తున్న వారికి, సోషల్ మీడియా సైనికులకు, ప్రతి రోజు కాంగ్రెస్‌తో తలపడుతున్న కార్యకర్తలకు, కేసులకు వెరవకుండా సింహాల్లా పోరాడుతున్న నాయకులకు ధన్యవాదాలు అని కేటీఆర్ తెలిపారు.

## కొణిజేటి రోశయ్యకు పుష్పాంజలి ఘటించిన సీఎం రేవంత్ రెడ్డి

**● విగ్రహ ఏర్పాటుకు ర్యలు తీసుకుంటామని హామీ ● నాలుగో వర్ధంతిలోపు విగ్రహ ఏర్పాటు జరగాలని ఆకాంక్ష**

**హైదరాబాద్,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ లో మాజీ సీఎం రోశయ్య విగ్రహ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. పలు సందర్భాల్లో రోశయ్య తనను ప్రోత్సహించారని గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్యకు సీఎం రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. రోశయ్య 3వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఆర్యవైశ్య ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు హైదరాబాద్ లో ఏదైనా మంచి ప్రదేశాన్ని గుర్తిస్తే అక్కడ రోశయ్య విగ్రహ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాలుగో వర్ధంతిలోపు విగ్రహ ఏర్పాటు జరగాలని ఆకాంక్షించారు. రోశయ్య వర్ధంతి కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. శాసనమండలి, శాసనసభలో పోటీ పడి స్పీచ్ ఇవ్వాలన్న స్ఫూర్తిని రోశయ్య ఇచ్చారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా రోశయ్య క్రమశిక్షణ పాటించడం వల్లనే 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ తో తెలంగాణ ఏర్పడిందన్నారు."చుక్క రామయ్య,ప్రొఫెసర్ నాగేశ్వర్, రోశయ్య లాంటి వారి మధ్య శాసనమండలిలో ఎమ్మెల్సీ గా మాట్లాడేందుకు నేను భయపడ్డాను. నీటి పారుదల శాఖ పైన మండలిలో నేను మాట్లాడినప్పుడు నన్ను తన ఛాంబర్ కు పిలిపించుకొని ప్రోత్సహించారు. ప్రతిపక్ష సభ్యుడినైనప్పటికి మండలి గౌరవం పెంచాలన్న ఉద్దేశంతో రోశయ్య నన్ను ఆనాడు ప్రోత్సహించారు. ప్రతిపక్షం లో ఉన్నప్పుడు ప్రశ్నించాలి. పాలక పక్షంలో ఉన్నప్పుడు పరిష్కరించాలని రోశయ్య నాకు సూచించారు" అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. చట్టసభల్లో అనాటి స్ఫూర్తి కొరవడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వొద్దన్నట్లుగా పరిస్థితులు తయారయ్యాయన్నారు. "రోశయ్య కుటుంబం రాజకీయాల్లో లేదు. సీఎంగా, గవర్నర్ గా,వివిధ హోదా ల్లో 50 యేళ్ల పైగా రాజకీయాల్లో గొప్పగా రాణించారు. తమిళనాడు గవర్నర్ గా ఎవరు వెళ్లినా వివాదాల్లో కూరుకుపోతుంటారు..కాని రోశయ్య అక్కడ వివాదాలు లేకుండా రాణించారు. అనాటి ముఖ్యమంత్రులకు రోశయ్య కుడి భుజం లా వ్యవహరించడం వల్లనే వారు సమర్థంగా పనిచేశారు. రోశయ్య లాంటి సహచరులు ఇప్పుడు లేకపోవడం పెద్ద లోటు. ప్రతిపక్షాల నుంచి వచ్చే ప్రశ్నల



నుంచి ప్రభుత్వాన్ని రోశయ్య కంచె వేసి కాపాడేవారు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. నెంబర్ 2 స్థానంలో రోశయ్య ఉండాలని ఆ నాటి ముఖ్యమంత్రులు కోరుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "ముఖ్యమంత్రి స్థానం కోసం ఏ నాడు రోశయ్య తాపత్రయపడలేదు. రోశయ్య నిబద్దత కారణంగానే అన్ని హోదాలు ఆయన ఇంటికి వచ్చాయి. సభలో సమస్యలను వ్యూహాత్మకంగా ఎదుర్కొవాలంటే రోశయ్య ఉండాలనే ముద్ర ఆయన బలంగా వేశారు. రాజకీయాల్లో ఆర్య వైశ్యులకు సముచిత స్థానం ఇస్తాం. నేను హైదరాబాద్ వ్యక్తినని గతంలో రోశయ్య స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తాం" అని స్పష్టం చేశారు.

## బొటానికల్ గార్డెన్‌లో పలు ఎకో టూరిజం ప్రాజెక్టులను ప్రారంభించిన సీఎం రేవంత్

**హైదరాబాద్,డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):**రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో పలు ఎకో టూరిజం ప్రాజెక్టులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. దీంతో పాటు బొటానికల్ థీమ్ పార్కులు, వర్చువల్ వైల్ లైఫ్ సఫారీ, ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా ప్రకృతి అందాలు చెంతకు తెచ్చే అద్భుతమైన వృక్ష పరిచయ కేంద్రాన్ని సిఎం ఆవిష్కరించారు. అలాగే అటవీ పర్యావరణహిత అభివృద్ధి కార్యాలయానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. బొటానికల్ గార్డెన్‌లో ఎకో టూరిజం కొత్తగూడెం, పాల్వంచ డివిజనల్ మేనేజర్ ఆఫీస్ కాంప్లెక్స్, సత్తుపల్లి డివిజనల్ మేనేజర్ ఆఫీస్ కాంప్లెక్స్‌ను వర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మి, కోదండరెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.బొటానికల్ గార్డెన్ వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ, పలువురు ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. బొటానికల్ గార్డెన్‌ను సందర్శించేందుకు వచ్చిన పాఠశాల విద్యార్థులను సీఎం పలుకరించి కరచాలనం చేశారు. దేశంలో తొలిసారిగా సందర్శకులు, విద్యార్థులను ఆకర్షించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన పర్యావరణహిత వృక్ష పరిచయ క్షేత్రంలో 75 రకాల థీమ్ పార్కులు ఏర్పాటు చేశారు. ఈ వృక్ష పరిచయ క్షేత్రంలో సీతాకోక చిలుక వనం, బతుకమ్మ వనం, నౌక వనం, రంగు రంగుల ఆకుల వనం, సూచిక వనం థీమ్ పార్కులు ఆకట్టుకున్నాయి.**ప్రత్యేక ఎకో టూరిజం పాలసీ తీసుకొస్తున్నాం: మంత్రి సురేఖ** రాష్ట్రంలో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో రాష్ట్రానికి ప్రత్యేక ఎకో టూరిజం పాలసీని తెస్తున్నట్లు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 12 ప్రముఖ ప్రాంతాలను ఎకో టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేయడం జరుగుతున్నదని అన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్కు, హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కుల్లో ఎకో-టూరిజం ప్రాజెక్టులను పిపిపి విధానంలో చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. కోట్ల విజయ భాస్కర్ రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి కలిసి పార్కులో మంత్రి సురేఖ మొక్కను నాటారు. ఈ కార్యక్రమాల అనంతరం మంత్రి బొటానికల్ గార్డెన్ సిబ్బంది కోరిక మేరకు వారితో ఫోటోలు దిగారు.స్వయంగా టిజిఎఫ్‌డిసి నూతన వాహనం నడిపిన మంత్రి సురేఖ తెలంగాణ ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ (టిజిఎఫ్ డిసి) నూతన వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. స్వయంగా మంత్రి గారే వాహనం నడిపి అటవీశాఖ సిబ్బందిలో జోష్ ను నింపారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ అటవీశాఖ సాధించిన వార్షిక పురోగతి నివేదికను అటవీ శాఖ ఉన్నతాధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ప్రజా పాలన–ప్రజా విజయోత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఇవాళ బొటానికల్ గార్డెన్ లో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. **వనమహోత్సవంలో 20.02 కోట్ల మొక్కలు నాటే లక్ష్యం** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమం ద్వారా 20.02 కోట్ల మొక్కలను నాటే లక్ష్యాన్ని పెట్టుకోగా, ఇప్పటివరకు 16.84 కోట్ల (84%) మొక్కలు నాటడం జరిగిందని మంత్రి సురేఖ తెలిపారు. తెలంగాణ హరితనిధి కింద మంజూరైన రూ.40.67 కోట్లతో 12 ప్రాజెక్టులు చేపట్టామని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం 'నగర్ వన యోజన పథకం' ద్వారా తెలంగాణ రాష్ట్రానికి 14 నగర వనాలను కేటాయించి, వీటి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన రూ.18.90 కోట్ల నిధులతో నగరాల్లో పచ్చదనం పెంపొందించే దిశగా కార్యాచరణను అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్ మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ వంద శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్ ద్వారా 1,738 హెక్టార్ల అటవీ భూమి రిజిస్టర్ చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ జోన్ కోర్ ఏరియా నుండి నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మైసంపేట్, రాంపూర్ గూడేలను తొలి విడతగా ఖాళీ చేయించడంతో పాటు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోర్ ఏరియా నుండి నాలుగు గ్రామాల తరలింపు పనులను వేగవంతం చేసినట్లు ప్రకటించారు.కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వ్ తో కలిపే 1442.26 చదరపు కి.మీల అటవీ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించేందుకు అటవీశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2024 లో



113 తునికాకు సేకరణ యూనిట్ల పరిధిలో 82,627 మంది తునికాకు సేకరణ కార్మికులు నమోదు చేసుకోగా, వీరికి ప్రభుత్వం రూ.29.40 కోట్లను ఆన్‌లైన్ లోనే చెల్లించిందని అన్నారు. రాష్ట్రంలోని తునికాకు సేకరణ కార్మికులకు నికర తునికాకు సేకరణ ఆదాయంగా రూ.158.49 కోట్లు పంపిణీ చేశామని మంత్రి పేర్కొన్నారు. నేషనల్ ట్రాన్సిట్ పాస్ సిస్టమ్ (ఎన్‌టిపిఎస్) ద్వారా అటవీ అనుమతులను ఆన్‌లైన్‌లో ఇస్తూ దాదాపు 22,954 అనుమతులు ఆన్‌లైన్‌లో జారీ చేసి పారదర్శకతకు పెద్దపీట వేసిందని మంత్రి సురేఖ తెలిపారు. **ఆక్రమణకు గురైన 17,643.30 ఎకరాల అటవీ భూమి స్వాధీనం...** ఆక్రమణకు గురైన 17,643.30 ఎకరాల అటవీ భూమిని స్వాధీనం చేసుకుని అటవీ భూముల పట్ల అటవీశాఖకు ఉన్న నిబద్ధతను నిరూపించుకున్నదని స్పష్టం చేశారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా అటవీ శాఖ పరిధిలోని సర్కిల్ హెడ్లు, జిల్లా అటవీ అధికారులు జిల్లాల వారీగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సంవత్సర కాలంలో సాధించిన లక్ష్యాలు, విజయాలను ప్రదర్శిస్తున్నట్లు మంత్రి తెలిపారు. భవిష్యత్లో అధికారుల సహకారం, సమన్వయంతో అటవీశాఖ ఉన్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు. టిజిఎఫ్ డిసి కార్పోరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం. డోబ్రియాల్, పిసిసిఎఫ్(కంపా) సువర్ణ, సిసిఎఫ్ ప్రియాంక వర్గీస్, మీ సేవా కమిషనర్ రవికిరణ్ నాయక్ (ఐఎఫ్ఎస్), టిజిఎఫ్ డిసి సిజిఎమ్ వెంకటేశ్వర్ రెడ్డి, జిఎం స్కైలాబ్, ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ రంజిత్ నాయక్, అసిస్టెంట్ డైరక్టర్ తనూజ, జూ డైరక్టర్ సునీల్ హెర్మత్ తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని రూ. 1000 కోట్లతో అభివృద్ధి

● కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలోనే అద్భుత విజయాలు సాధించింది

● నిన్నటితో ఎమ్మెల్యేగా ఎన్నికై సంవత్సరం పూర్తి అయింది ● నాపై నమ్మకంతో నన్ను ఆదరిస్తున్న నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు ● స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి ఎంత చేసిన, ఎం చేసిన తక్కువే ఈ ఏడాది కాలంలోనే నియోజకవర్గంలో రూ. 745 కోట్ల అభివృద్ధి పనులకు మంజూరు ● మార్చి 31వరకు రూ.1000కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించే బాధ్యత నాది ● ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి ● కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయాలను సాక్ష్యాలతో నిరూపించడానికి సిద్ధం



**హనుమకొండ ప్రతినిధి: డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** మార్చి 31 2025వరకు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 1000కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించే పూర్తి బాధ్యత నాదేనని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. బుధవారం స్టేషన్ ఘనపూర్, చిల్పూర్ మండలాలకు సంబందించిన కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో స్టేషన్ ఘనపూర్ మండలానికి చెందిన 20మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ. 20లక్షల 02 వేల 320 రూపాయల విలువ గల చెక్కులను అలాగే 37మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ. 11లక్షల 24వేల 500 రూపాయల విలువగల చెక్కులను, చిల్పూర్ మండల కేంద్రంలోని వరలక్ష్మి గార్డెన్స్ లో చిల్పూర్ మండలానికి చెందిన 28మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ. 28లక్షల 03వేల 248రూపాయల విలువగల చెక్కులను అలాగే 20మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ. 6లక్షల 03వేల రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగాగడిచిన సంవత్సరం నుండి కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి, LOCల ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. కల్యాణ లక్ష్మి దరఖాస్తు చేసుకున్న నెల రోజులలోగా చెక్కులు అందే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అవినీతికి ఆస్కారం లేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గా ఎన్నికై నిన్నటితో సంవత్సరం పూర్తి చేసుకొని నేడు రెండవ సంవత్సరంలో అడుగు పెట్టానని, నాపై నమ్మకంతో నన్ను ఆదరించి ఆశీర్వదించిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజల ఋణం తీర్చుకోలేనిదని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి ఎంత చెసిన, ఎం చేసిన తక్కువేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల అభివృద్ధియే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి



**తొర్రూరు ప్రతినిధి, డిసెంబర్ 4(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా ప్రభుత్వంలో ప్రజా ఆరోగ్యానికే అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే యశశ్విని ఝాన్సీ రేడ్డి పేర్కొన్నారు.మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని ఎంఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రమాదవశాత్తు బాధపడుతూ మెరుగైనా చికిత్స కోసం ప్రవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న నిరుపేద కుటుంబాలకు చేయూతనిస్తూ పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మండలం, రాయపర్తి, పెద్దవంగర, మండలాలకు చెందిన వివిధ గ్రామాలోని 54 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన సుమారు 17,లక్షల 02, వేల 500 రూ,, విలువగల ఛేక్కులను బుధవారం లబ్ధిదారులకు పంపించేసిన స్థానిక పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే హనుమాండ్ల యశశ్విని ఝాన్సీ రెడ్డీ .ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూప్రజారోగ్యానికి సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని అన్నారు.. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, పెద్ద మొత్తంలో సీఎం ఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కుతుందన్నారు, నిరుపేదల అభివృద్ధియే లక్ష్యంగా అనేక సంక్షేమాలకు రాబోయే రోజుల్లో అనేక సంక్షేమాలు పథకాలు చేపట్టబోతున్నమని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలు ప్రమాదాల బారిన ఎవరైనా,తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజలందరికీ సీఎంఆర్ఆఫ్ అప్లికేషన్లపై అవగాహన కల్పించాలని కార్యకర్తలకు నాయకులకు ప్రజలకు పిలుపు నిచ్చారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, బ్లాక్ అధ్యక్షులు ఆమ్యా నాయక్, మండల అధ్యక్షులు సుంచు సంతోష్, రవీందర్ రెడ్డి, ముద్ద సాని సురేష్, సీనియర్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు, గ్రామపార్టీ అధ్యక్షులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.



# కేంద్రం బీసీల లెక్కలు తేల్చాల్సిందే...

● బీసీల జనాభా దమాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్ ఇవ్వాలి ● బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**హనుమకొండ ప్రతినిధి, డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 5వ తేది రోజున ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద చేపట్టనున్న మహాధర్నా కార్యక్రమానికి కాజీపేట్ రైల్వే స్టేషన్ నుండి బయలు దేరుతున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులకు జెండా ఊపే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రం త్వరలో చేపడుతున్న జనాభా లెక్కల్లో బీసీల కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో సగభాగానికి పైన ఉన్న బీసీలకు గణాంకాలు లేని కారణంగా విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో వెనుకబడి పోతున్నారని అన్నారు. ఎప్పుడో బ్రిటిష్ ప్రభుత్వం హయాంలో బీసీలు లెక్కలు తీయడం జరిగిందని ఆ జనాభా లెక్కల ప్రకారం ఇప్పటికి రిజర్వేషన్ అమలవు తున్నాయని, దీనివలన బీసీ లకు తీరని అన్యాయం జరుగుతుంది అని అన్నారు. కేంద్రం ఖచ్చితంగా బీసీల లెక్కలు తీయాల్సిందేనని డిమాండ్ చేశారు. డిసెంబర్ 5వ తేదీ రోజున ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీల కులగణన చేపట్టాలని ప్రధాన డిమాండ్ తో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు శ్రీ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీసీల మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా బీసీ ముఖ్య నాయకులు హాజరవుతున్నారని అన్నారు. ఢిల్లీకి బయలుదేరిన వారిలో బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇంచార్జ్ ఆరేగంటి నాగరాజు గౌడ్, బొస్క నాగరాజు , ముత్యాల సాయి గౌడ్, శ్రీకాంత్, మహేందర్, మహేష్, వినోద్, సాయి వరుణ్, అనిల్, తదితరులు ఉన్నారు.

# వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధియే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం

● సిసి రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హనుమకొండ ప్రతినిధి: డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నడుస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం రోజున 43వ డివిజన్ పరిధిలోని పలు కాలనీల సుమారు రూ. 3కోట్ల 11 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశల వారిగా అన్ని డివిజన్ల లో సైడ్ డ్రైన్, సీసీ రోడ్ల పనులను చేస్తున్నామని రోడ్డు నిర్మాణ పనుల్లో స్థానిక కాలనీ వాసులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.కాలనీలలో ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి కానీ నా డయల్ యువర్ ఎమ్మెల్యే 8096107107 కి ఫోన్ చేసి మీ సమస్య మా దృష్టి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంతన్న నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం జోడేడ్ల మాదిరి సాగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు లు, ఆరోగ్య శ్రీ కార్డులు అందిచమని మళ్ళీ నేటి ఇందిరమ్మ ప్రభుత్వంలో త్వరలో అర్హులకు రేషన్ కార్డులను, డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డుల జారికీ ప్రభుత్వం సన్నద్ధం అవుతుందాన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం నిర్మించడానికి సిద్ధంగా ఉందన్నారు. డిజిటల్ రేషన్, హెల్త్ కార్డుల ప్రక్రియకు ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఒక పట్టణం, ఒక గ్రామాన్ని ఎంచుకునే విషయాన్నీ గుర్తు చేశారు.. అలాగే ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రైతు రుణమాఫీ చేసిన గొప్ప ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వం అని, సంక్రాంతి తర్వాత రైతు భరోసా ఇవ్వనున్న ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు ఇది చేతల ప్రభుత్వం దయచేసి ప్రజలందరూ బిఆర్ఎస్ బిజెపి నాయకుల మాయమాటలకు మోసపోకుండా అన్నం పెట్టే కాంగ్రెస్ పార్టీని హక్కున చేర్చుకోవాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ అశ్విని తనాజి వాకడే, స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఈదుర్ల అరుణ – విక్టర్, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మానీ శేఖర్ రావు, మండల అధ్యక్షుడు వడ్డేపల్లి ప్రకాష్, డివిజన్ అధ్యక్షుడు చింత ప్రకాష్, డివిజన్ కాంగ్రెస్ నాయకులు గంట నరేందర్ రెడ్డి, కొమురెల్లి యాదవ్, సుభాకర్ యూత్ నాయకులు శివరాంకృష్ణ, బాబ్జి, నాయకులు, కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తా

● హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మాలదరణ భక్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



**తొర్రూర్ ప్రతినిధి, డిసెంబర్ 4(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూర్ పట్టణంలోని హరిహర అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప మాలదారణ భక్తులు బుధవారం నిర్వహించిన మహా పడిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని శాస్త్రోత్తంగా పూజలు నిర్వహించి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశశ్విని ఝాన్సీ రెడ్డి వేద పండితులు మంత్రోత్సనాలు,పూర్ణకుంభలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే ప్రసంగిస్తూస్వామివారి పడిపూజ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉన్నదని అన్నారు.ప్రజలపై అయ్యప్ప స్వామి కృప తప్పక ఉంటుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రజలంతా సర్వ దోషాల పోయి సుఖంగా ఉండాలని భగవంతున్ని కోరుకున్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రం, నియోజకవర్గ ప్రజలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటూ ఆకాంక్షించి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా కృషి చేస్తామని అన్నారు.ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, ఆలయ అర్చకులు, అయ్యప్ప స్వామి భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ సిటీ నిధులతో కాజీపేట జంక్షన్ సుందరీకరణ



**హనుమకొండ ప్రతినిధి: డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాజీపేట చౌరస్తాలో సుందరీకరణ అభివృద్ధి పనులను స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టామని, ఈ నిధులతో నరగ మంతా అభివృద్ధి పనులు చేశామని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కాజీపేట చౌరస్తాలో రూ.28 లక్షల నిధులతో జంక్షన్ సుందరీకరణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాజీపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, ఆ దిశగా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, మునిసిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, స్థానిక కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ, సంకు నర్సింగరావు, మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామి, బంక సంపత్, అజార్, ఇప్ప శ్రీకాంత్, పోగుల శ్రీను, దొంగల కుమార్, అశోక్, రాజేశ్ పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం తప్పిన ప్రాణాపాయం

- యాక్సిడెంట్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు..



**టేకుమట్ల, డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** రేగొండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన రావుల రవి అనే ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్ నడుపుకుంటూ టేకుమట్ల నుండి గరిమిళ్లపల్లి వైపు వెళ్తుండగా గరిమిళ్లపల్లి గ్రామ సమీపంలో కి రాగానే గరిమిళ్లపల్లి వైపు నుండి టేకుమట్ల వైపు ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇప్పకాయల రాజేష్ తన టాటా ఇండికా కారుతో ఎదురెదురుగా ఢీ కొనడం జరిగింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ రావుల రవికి,ట్రాక్టర్ పైన ఉన్న గసికంటి ప్రవీణ్ కు గాయాలు అయ్యాయి.ట్రాక్టర్ యజమాని లింగంపల్లి రామారావు పిర్యాదు మేరకు కారు డ్రైవర్ ఇప్పకాయల రాజేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్సై దాట్ల కుమారస్వామి తెలిపారు..

# ఓరియంట్ అధికారులకు ముందు చూపు ఎక్కువ

● గిరిజనుల పై మక్కువ చూపుతున్న యాజమాన్యం ● తాగునీరు సమస్య తలెత్తకుండా చూస్తామంటున్న అధికారులు



**కాసిపేట మండల ప్రతినిధి,డిసెంబర్ 4(పిసిడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కర్మాగారం అధికారులు ముందుచూపుతో రానున్న వేసవికాలంలో గిరిజన గూడాల గిరిజనులదాహాన్ని తీర్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యూనిట్ హెడ్ బాల గిరిధర్ కు వచ్చిన ఆలోచనతోవేసవిలో ఏర్పడే నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని గ్రామ పెద్దలతో కలిసి బుధవారం గట్రావుపల్లి గ్రామపంచాయతీ లోని తుడుం గూడెం, గట్రావపల్లి గ్రామం, ఇప్పల గూడెం, సాలెగూడంలలో కలిపి ఆరు బోర్వెల్స్ వేయడానికి భూమి పూజలు నిర్వహించారు. తుడుం గూడెంలో బోరు వేయడం ప్రారంభోత్సవం చేశారు. ఈ ఆరు బోర్ వెల్స్ ని సి. ఎస్.ఆర్ నిధులతో ఈ రెండు రోజుల్లోనే పూర్తి చేయాలని సివిల్ డిపార్ట్మెంట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జిఎం హెచ్ఆర్ ఆనంద్ కులకర్ణి గారు, సివిల్ డిపార్ట్మెంట్ అధికారులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. బోరు వేసి వదిలేస్తే తాగునీటి సమస్య ఎలా తీరుతుందని గిరిజనులు పేర్కొంటున్నారు. గిరిజనులకునాటి సమస్యలు నెరవేరబోతున్నాయి.



# సంద్ర ఉపేందర్ కుటుంబానికి పి.ఆర్.టి.యు ఆర్థిక సహాయం



**బయ్యారం,డిసెంబర్ 4(పిసి డబ్ల్యు న్యూస్):** పి.ఆర్.టి.యు (టి.ఎస్ ) సంఘం బయ్యారం మండల శాఖ ఆధ్వర్యంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడు సంద్ర ఉపేందర్ కుటుంబాన్ని పరామర్శించి రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని పి.ఆర్.టి యు(టి.ఎస్)సంఘం బయ్యారం మండల అధ్యక్షులు మోహన్ నాయక్ ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమానికి కేవీస్ ఫౌండేషన్ చైర్మన్ అజ్మీర కోటేశ్వరరావు కూడా 2000 రూపాయలు అందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు వై. గాయత్రి,మండల ఉపాధ్యక్షులు భూక్యా రవి, సునీత,ఎమ్మెల్సీ ఎలక్షన్ కో-ఆర్డినేటర్ జి.రామారావు, వెంకట్రావు,సుధాకర్,శ్రీ లక్ష్మీ, నరసింహారావు, అజ్మీర రవి, ఇస్లావత్ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడం తగదు: కరీంనగర్ మాజీ మేయర్



**కరీంనగర్ టౌన్, డిసెంబర్ 04(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి మూడెకరాలు ఇస్తూ జీవో జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ఆ స్థలాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు మరో జీవో జారీ చేయడం సరికాదని మాజీ మేయర్ రవీందర్ సింగ్ అన్నారు. కరీంనగర్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే ఆ స్థలంలో ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. స్థలం రద్దు జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# కోటిలింగాల పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**వెల్గటూర్,డిసెంబర్ 04(పిసిడబ్ల్యూ న్యూస్):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కోటిలింగాల పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ సూచనల మేరకు బుధవారం ఆల యఅధికారులు అర్చకులు ప్రత్యేకంగా శివలింగానికి పంచా మృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సంజు శర్మ నాగరాజ్ శర్మ అన్వేష్ శర్మ,సిబ్బంది జూనియర్ అసిస్టెంట్ రాజయ్య భక్తులతో కలిసి అభిషేకాలు నిర్వహించిన అనంతరం అర్చకులు తీర్థప్రసాద వితరణ చేసి ఆశీర్వదించారు.

# పెగడపెల్లి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి, సత్య ప్రసాద్

**జగిత్యాల, డిసెంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** జగిత్యాల జిల్లా పెగడపెల్లి మండల మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సంబంధించిన , రికార్డ్స్ సరిగ్గా నమోదు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం ధరణి సమస్యలు, ఆఫీసుకు వచ్చే అన్ని దరఖాస్తులను, ఎప్పటికప్పుడు అర్జీలను ప్రజలకు అందించాలని ఆదేశించారు. అనంతరం రికార్డ్ గది, ఫైల్స్, ఆన్లైన్లో నమోదు దరఖాస్తులను పరిశీలించారు ఎమ్మార్వో ఆఫీసు కు వచ్చే దరఖాస్తులను లను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. అలాగే ప్రజావాణి ఫిర్యాదు లను కూడా వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అధికారులు అందరు సమయపాలన పాటించాలని సూచించారు. ఆఫీస్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని చెప్పారు .కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీఓ మధు సుధను,ఎమ్మార్వో, మండల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# అంగారక టౌన్ షిప్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

- హాజరైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్,కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పేయ్, కాంగ్రెస్ నాయకులు



**తిమ్మాపూర్, డిసెంబర్ 0 4 (పీసీడబ్ల్యూ న్యూస్) :** మానకొండూరు నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీ గ్రామంలోని అంగారక టౌన్ షిప్ (రాజీవ్ స్వగృహ) లో శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ నిధులతో చేపట్టిన అంతర్గత రహదారుల నిర్మాణానికి మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూమిని వేలం పాట ద్వారా ప్రజలకు అమ్మేశారు కానీ ఇక్కడ ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు మూడు సంవత్సరాల నుండి ఎంతోమంది సామాన్య ప్రజలు ఫ్లాట్లు కొనుక్కొని అనేక ఇబ్బందులు పడుతున్నామని మా దృష్టికి తీసుకురావడం జరిగింది.మేము మా సుడా చైర్మన్ వెంటనే స్పందించి టౌన్ షిప్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తున్నాముఇక్కడ ఎంతోమంది రిటైర్డ్ ఎంప్లాయిస్ లక్షలు వెచ్చించి ఫ్లాట్లు కొనుక్కొని ఇల్లు కట్టుకోలేని పరిస్థితిలో ఉండటం చాలా బాధాకరం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మీకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుంది మొదట గ్రావిలింగ్ పనులు చేసి ప్రభుత్వం ద్వారా మరిన్ని నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేస్తామని అన్నారు.

# అంజమ్మ మ్రుతి జ్యోతికాలనీ వాసులకు తీరనిలోటు

- అంజమ్మ పోరాటాలను కీర్తించిన సిపిఎం, సిపిఐ, బీఎస్పీ, టిడిపి, ఇతర ప్రజాసంఘాలు
- సిపిఎం జవహర్ నగర్ సీనియర్ నేత నాగేష్ కుటుంబానికి సానుభూతిని ప్రకటించిన పలువురు నేతలు





**జవహర్ నగర్, డిసెంబర్-4(పిసీడబ్ల్యు న్యూస్):** మేడ్చల్ జిల్లా, కాప్రా, జవహర్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్ సిపిఎం సీనియర్ నాయకులు దావత్ నాగేష్ సతీమణి అంజమ్మ మ్రుతికి పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన నేతలు సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాలాజీనగర్, జ్యోతి కాలనీ లోని తన నివాసంలో గత ఆరు సంవత్సరాలుగా తీవ్ర అనారోగ్యంతో బాదపడుతూ 2024, డిసెంబర్-3, మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. అంజమ్మ మరణవార్త తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజీ. నర్సింగరావు, కోమటి రవి, జి. శ్రీనివాస్ పార్టీ మేడ్చల్ జిల్లా నాయకులు, టి.రాంచందర్ ప్రజానాట్యమండలి రాంచందర్, ఐద్వా మాదవి, విజయక్క, సిఐటీయు శివన్నారాయణ, సిపిఐ దశరథ, దర్శనం యాదగిరి, బీఎస్పీ బిర్రు యాకస్వామి, టిడిపి చెన్నాపురం యాదగిరి తథితరులు పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాలలతో నివాళులు అర్పించి, అంజమ్మకు బుదవారం రోజున విప్లవ జోహార్లు తెలియజేశారు. సిపిఎం రాజకీయ విశ్వాసాలకు, వారి ఆచరణకు అండగా నిలిచిన అంజమ్మ మరణం తమ పార్టీకేగాక, జ్యోతి కాలనీ వాసులకు కూడ తీరనిలోటు అని ఆ పార్టీకి చెందిన రాష్ట్ర, జిల్లా నాయకత్వం గుర్తుచేశారు. భర్త నాగేష్ అన్నతోపాటు కలిసి అంజమ్మ అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని అన్నారు. మద్యపానం వలన వీధిపాలు అవుతున్న తమ జీవితాలను ద్రుష్టిలో పెట్టుకొని, కాలనీలో వెలసిన ప్రభుత్వ సారా, కల్లు దుకాణాలకు వ్యతిరేకంగా ఉద్యమించి, ఎత్తివేసేలా పోరాడి విజయం సాదించారని అన్నారు. కాలనీ నుండి సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో గల అనేక ప్రాంతాల్లో ఫ్యాక్టరీ కార్మికులు, ఇళ్ళల్లో పనిచేసేవారు, చిరు ఉద్యోగులు మరియు చదువుకునే విద్యార్థులకు సమయానికి వెళ్ళడానికి పడుతున్న ఇబ్బందులను చూసి, వారి సమస్యలను తనవిగా భావించి, ఆర్టీసీ బస్సు సౌకర్యం కొరకు కాలనీ వాసులను సంఘటిత పరిచి, ఐద్వా నాయకత్వన పోరాటం కొనసాగించి, బస్సును కాలనీకి రప్పించిన ఘనత అంజమ్మకే దక్కుతుందని కొనియాడారు. సిపిఎం పార్టీ ఏర్పాటు చేసే రాజకీయ శిక్షణా తరగతులకు, వారు వివిధ కార్యక్రమాల్లో బాగంగా ఏర్పాటు చేసే వాలంటరీ సేవలలో సభ్యురాలిగా హాజరై, చిన్నపిల్లలను వెంటేసుకొని చురుకుగా పాల్గొనేవారని గుర్తుచేశారు. ఇంటికి వచ్చిన పార్టీ శ్రేణులకు అన్నపానీయాలు సమకూర్చి అవసరాలను తీర్చేదని అన్నారు. పార్టీ రాజకీయలన్న, నాయకత్వం అన్న అంజమ్మకు ఎంతో గౌరవ మర్యాదలు ఉండేదని చెప్పారు. గత ఆరు సంవత్సరాలుగా తీవ్ర అనారోగ్యంతో బాదపడుతూ మంచానికే పరిమితమైన అంజమ్మ మరణం తమను తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన చెందారు. ఈ సందర్భంగా నాగేష్ ను, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంజమ్మ భర్త చేసిన సేవలను కొనియాడుతూ కామ్రేడ్ నాగేష్ ఎందరికో ఆదర్శంగా నిలిచారని కొనియాడుతూ... మానసిక ధైర్యాన్ని అంజన్నకు అందించారు.

# 14న జాతీయ లోక్ అదాలత్: న్యాయమూర్తి వెంకటేష్..



**కరీంనగర్ జిల్లా, డిసెంబర్ 04 (పీసీడబ్ల్యూ న్యూస్):** జాతీయ,రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ లను నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి,న్యాయమూర్తి వెంకటేష్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సామావేశంలో అయన మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్ లో రాజీ చేయదగిన 1374 కేసులు గుర్తించినట్లు, వాటిలోని 1095 కేసులలో కక్షిదారులకు నోటీసులు పంపించడం జరిగిందని ఆయన తెలిపారు. నోటీసులు అందుకున్న వారు ఆ రోజు లోక్ అదాలత్ లకు హాజరై వారిపై కేసులు రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. లోక్ అదా లతులలో కేసుల రాజీ ద్వారా సత్వర పరిష్కారంతోపాటు సమయం, డబ్బు వృధా కాకుండా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ లోక్ అదాలతులు ఇచ్చే తీర్పులకు అప్పీల్ ఉండదని ఆయన తెలిపారు.ఈ లోక్ అదాలతో రాజీచేదగిన క్రిమినల్,సివిల్, ఫ్యామిలీ, బ్యాంక్,మోటార్ ప్రమాద కేసులతోపాటు, చెక్ బౌన్స్,డ్రంక్ అండ్ డ్రైవ్,ట్రాఫిక్ చలాన్ లతో పాటు ఇతర కేసులను కూడా పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ లోక్ అదాలత్ లను అందరూ సద్వినియోగపరుచుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# సంకపల్లి అశోక్ రెడ్డి ఇంట వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ





**బయ్యారం,డిసెంబర్ (పిసిడబ్ల్యూ న్యూస్):** బయ్యారం మండల కేంద్రంలో సంకపల్లి అశోక్ రెడ్డి నివాసంలో గురు స్వామి పెద్దినేని వెంకటేశ్వరరావు స్వామి ఆద్వర్యంలో అయ్యప్ప శరణు గోషతో మార్మోగింది.అయ్యప్ప స్వాములు మంగళవారం రాత్రి 11 గంటలకు అయ్యప్ప స్వామి పడిపూజ, పదు నెట్టాంబడి మహొత్సవం వైభవంగా జరిగింది.ప్రత్యేక వేదికపై గణపతి,అయ్యప్ప సుబ్రమణ్య ,వెంకటేశ్వర్ల ,దుర్గామాత ఉత్సవ మూర్తులకు అయ్యప్ప దేవాస్థాన అర్చకుడు నంబూద్రిస్వామి , గురుస్వాములు పెద్దినేని వెంకటేశ్వరరావు, పూర్ణ స్వామి లు ప్రత్యేక పూజలను ఘణంగా నిర్వహించారు. అయ్యప్ప విగ్రహంనకు పంచామృత అభిషేకం నిర్వహించి, అర్చన,అష్టోత్తర శతావలి(శతనామావళి) జరిపారు. పదునెట్టాంబడి ప్రత్యేక పూజలను నిర్వహించిన గురుస్వామి అయ్యప్ప స్వాములచే కర్పూర హరతులను అందించారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు చేసిన భజనలతో ఆ ప్రాంతం భక్తి గీతాలు, దేవతా మూర్తుల పాటలతో మారు మోగింది. తరువాత ఇంటి స్వామి అయినా అశోక్ రెడ్డి స్వామితో కలిసి అయ్యప్పలు, అంజన్నలు పేడతుల్లి నిర్వహించారు.అయ్యప్ప స్వాములకు అంజన్న, శివ, ఇతర మాల స్వాములకు అల్పాహారం అందించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు తాంబూలాలు ఇచ్చి ఆనంద పరిచారు. అయ్యప్ప స్వాములు, ఆంజనేయ మాల స్వాములు, శివ మాల స్వాములు,భక్తులు పడిపూజ నిర్వహకులకు, కుటుంబ సభ్యులకు దీవెనలు అందించారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు,బయ్యారం,మహబూబాబాద్ అయ్యప్ప స్వాములు, ఇతర మాల స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయడమే ఈ పరీక్ష లక్ష్యం



**టేకుమట్ల, డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** టేకుమట్ల మండలలో న్యాస్ 2024 పరీక్షను దేశవ్యాప్తంగా ఎన్సీఈఆర్టీ లోని స్వతంత్ర సంస్థ అయిన పరాక్ (పర్ఫార్మెన్స్ అసెస్మెంట్ రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జి ఫర్ హెూలిస్టిక్ డెవలప్మెంట్), రాష్ట్రీయ సర్వేక్షన్ 2024 పేరుతో సెంట్రల్ సిలబస్ తో కూడిన ప్రశ్నలను తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల కు బుధవారం న్యాస్ 2024 పరీక్ష ను అబ్జర్వర్ లు నెరుపటి అంకూస్, రావుల రామచెంద్రు లు నిర్వహించారు. పాఠశాలలలోని, మూడవ, ఆరవ తొమ్మిదవ తరగతులకు చెందిన విద్యార్థులలోని అభ్యాసన సామర్థ్యాలను అంచనా వేయుటకు గాను ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా టేకుమట్ల మండల విద్యాశాఖాధికారి చిదిరాల సుధాకర్ ప్రాథమిక పాఠశాల టేకుమట్ల మరియు కేజీబీవీ రాఘవరెడ్డి పేట పాఠశాలలను తనిఖీ చేశారు ఈ కార్యక్రమంలో న్యాస్ అబ్సర్వర్ లు నెరుపాటి అంకూస్, రావుల రామచంద్రు మరియు పరీక్షల ఇన్విజిలేటర్ లు, వివేక్, అభిజ్ఞ, విజయ్, లత, లు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్, ఉపాధ్యాయులు చాగంటి ఆనంద్ ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్లు కుమార్, మహేష్ , కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఎన్ స్వప్న, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మహేందర్, శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# 6న వరంగల్‌లో జరిగే జన సభను జయప్రదం చేయండి

- సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ మండల కార్యదర్శి ఆకునూరి జగన్



**టేకుమట్ల, డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామంలో కరపత్ర ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవందలాదిమంది త్యాగాల ఫలితంగా ఏర్పడిన స్వరాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు నీళ్లు నిధులు నియమకాల పేరుతో సాగిన ఉద్యమ ఫలితాలు ప్రజలుపొందలేకపోయారు బంగారు తెలంగాణ సామాజిక తెలంగాణ ప్రజాస్వామ్య తెలంగాణ అని నినాదాలు చేస్తూ ఎన్నికల అస్త్రాలుగా మాత్రమే మిగిలిపోయాయి ధనిక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ కెసిఆర్ అనుసరించిన తప్పుడు విధానాల వల్ల లక్షల కోట్ల అప్పుల్లోకి కోరుకుంది అవినీతి బంధుప్రీతి వచ్చే అవకాశవాదం పెరగడంతో ప్రజలు నియంతృత పరిపాలన ఎదుర్కోవాల్సి వచ్చింది పార్టీ పేరును మార్చిన ప్రజలు తిరస్కరించినారు గత ప్రభుత్వం కేంద్రంలో అధికారం ఉన్నటువంటి ప్రభుత్వంతో దోస్తీ చేసి సహజవనులను సంపదలను దోసుకున్నారు వేల కోట్ల రూపాయలను వెనకేసుకున్నారు వాళ్లు అనుసరిస్తున్న విధానాల వల్ల రాష్ట్రంలో బిజెపి ఎదుగుదలకు అవకాశం ఏర్పడింది ప్రజల్లో చీలిక తెస్తూ మతతత్వ శక్తులు బలపడుతున్నాయి ఎదురుకోవడానికి ఇప్పుడు ఉన్నటువంటి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండ కట్టడం కోసం కార్మికులు కర్షకులు ప్రజలు మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జన సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేసినారు.. పాల్గొన్నవారు ఏ వీరయ్య ఏ రాజు కే కుమార్ పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్టాపన చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**జగిత్యాల టౌన్ డిసెంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** జగిత్యాల పట్టణ 12 వ వార్డు ఉప్పరి పేటలో శ్రీ దాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్...అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి భోజనంచేశారుఎమ్మెల్యే.ఈ కార్యక్రమంలో నంబి వేణుగోపాల కౌశిక నాయకులు అల్లాల దామోదర్ రావు, బాలె శంకర్ ,భగవంతరావు రాజేశ్వరరావు, ప్రవీణ్ రావ్, క్రాంతి, రాజేష్ ,కోటేశ్వరరావు, ప్రకాష్ రావు,విద్యాసాగర్ రావు,కిషన్ రావు,సుధాకర్ రావు,భూమా రావు,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పంబా ఆరాట్ మహోత్సవ కార్యక్రమానికి పెద్దికి ఆహ్వానం

- శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి సేవచారిటబుల్ ట్రస్ట్
- ఆలయ చైర్మన్ అధ్యక్షులు సింగిరికొండ మాధవ శంకర్
- కమిటీ అధ్యక్షులు సైప సురేష్



**నల్లబెల్లి, డిసెంబర్ 04, (పీసీడబ్ల్యూ న్యూస్):** పంబ ఆరాట్ మహోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించిన శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి సేవ చారిటబుల్ ట్రస్ట్,నర్సంపేట అయ్యప్ప స్వాములు శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం కమిటీ వారు ప్రతి సంవత్సరం 9తేదీ న



నిర్వహిస్తున్న పంబా ఆరాట్ మహోత్సవ కార్యక్రమానికి నర్సంపేట మాజీ శాసన సభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ని ఆహ్వానించడం జరిగింది. అయ్యప్ప స్వామి భక్తునిగా గత 21 సంవత్సరాలుగా పంబా ఆరాట్ మహా అన్నదాన ( పంబా సద్ది) కార్యక్రమానికి దాతగా పెద్ది సుదర్శన్ రెడ్డి నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సింగిరికొండ మాధవ శంకర్ అధ్యక్షులు సైప సురేష్ కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి కోశాధికారి దొడ్డ రవీందర్ మరియు ఇతర ఆలయ కమిటీ సభ్యులు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి వరాలు



**పెద్దపల్లి జిల్లా:డిసెంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** పెద్దపల్లి జిల్లా పై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి,సీఎం రేవంత్ రెడ్డి, వరాల జల్లు కురిపించారు.ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈరోజు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన యువ వికాసం విజయో త్సవ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హాజరయ్యారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సభాస్థలి వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. రూ.1000కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. యువ వికాస సభను జ్యోతి ప్రచురణ చేసి ప్రారంభించారు. అనంతరం 9వేల మంది నిరుద్యోగులకు నియామ కపు పాత్రలు అందించే కార్యక్రమంలో పదిమంది నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఏడు కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. ముఖ్య మంత్రి బహిరంగ సభకు జిల్లా నుండి లక్ష మందికి పైగా జనం తరలివచ్చారు. సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది.**వెయ్యి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు :**జిల్లా పరిధిలో చేపట్టే రూ.1000 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. 82 కోట్ల రూపాయలతో నిర్మించే పెద్దపల్లి బైపాస్ రోడ్డు, సుల్తానాబాద్ బైపాస్ రోడ్ల నిర్మాణాలకు, జిల్లా కేంద్రంలో రూ.5 కోట్లతో స్వశక్తి మహిళా ప్రాంగణం భవన నిర్మాణంతోపాటు..రామగుండం నియోజక వర్గంలో రూ. 60 కోట్లతో ఆర్అండ్బీ రోడ్ల నిర్మాణ పనులకు, మంథనిలో ఆర్అండ్బీ పెండింగ్ రోడ్ల పూర్తికి, రూ. 10 కోట్లతో అంతర్గాంలో, మంథని గంగపురిలో, పోతారం గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు, అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లిలో బండ్లవాగు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభించారు.జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, రామగుండం మున్సిపా లిటీల పరిధిలో రూ. 51కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు, ఓదెల మండలం రూపునారాయణపేట వద్ద మానేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ. 80 కోట్లతో చేపట్టే పనుల తో పాటు...కాల్వశ్రీరాంపూర్ నుంచి మొట్లపల్లి రూ.25కోట్లతో, పీడబ్ల్యూ రోడ్ నుంచి ఎల్లంపల్లి వరకు రూ.7 కోట్లతో రోడ్ల నిర్మాణాలకు, రూ.6 కోట్లతో గర్రెపల్లి నుంచి ఎలిగేడు వరకు రహదారి విస్తరణ, రూ.5 కోట్లతో హుస్సేన్ మియా వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి, రూ. 12 కోట్లతో సుగ్లాంపల్లి నుంచి ధూళికట్ట వరకు రహదారి విస్తరణ పనులకు, రామగుండంలో రూ. 60 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.మంథనిలో బ్రిడ్జి, రోడ్ల నిర్మాణానికి, మంథని ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్గ్రేడ్ చేసే పనులను ప్రారంభిం చారు. 2.45 కోట్ల రూపాయలతో నిర్మించే గుంజపడుగులో 30 పడకల ఆస్పత్రికి, పెద్దపల్లి 50 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్గ్రేడ్ చేసే పనులను ప్రారంభిం చారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి, ఆర్అండ్బీ, పంచాయతీ రాజ్ రోడ్ల నిర్మాణాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.9 వేల మందికి నియామక పత్రాలు యువజన వికాస విజయోత్సవ సభలో 9వేల మంది నిరుద్యోగులకు నియామకపు పత్రాలు సీఎం అందించనున్నారు. 500మందికి సింగరేణి ఉద్యోగాల నియామకాలు, గ్రూప్- 4, ఇతర ఉద్యోగాలు దాదాపు 8500 మందికి ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందిస్తారు.4 పోలీస్ స్టేషన్లు, ఆర్టీసీ డిపో మంజూరుజిల్లా పర్యట నకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాలుగు పోలీస్ స్టేషన్లో తో పాటు పెద్దపల్లికి ఆర్టీసీ డిపో మంజూరు చేశారు.జిల్లా కేంద్రంగా ఏర్పడిన పెద్దపల్లిలో ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్ల తో పాటు నూతనంగా పెద్దపల్లి రూరల్, ఎలిగేడు పోలీస్ స్టేషన్లను మంజూరు చేశామని, జీవో సైతం విడుదల చేశామన్నారు.

# విజయం సాధించిన కట్కూరి దేవేందర్ రెడ్డి బలపరిచిన టీం





**పరకాల, డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, అధ్యక్ష ఎన్నికలు ఆగస్టు సెప్టెంబర్ రెండు నెలలు యూత్ ఓటు ఎన్రోల్మెంట్ మరియు ఓటు వేసిన యూత్ కాంగ్రెస్ పలితాలు ఈరోజు సాయంత్రం ఏడు గంటలకు వెలువడ్డాయి.ఈ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి శాసనసభ్యులు గౌరవ రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాలతో పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి బలపరిచిన టీం మొత్తం విజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది అనంతరం క్యాంపు కార్యాలయంలో బాణా సంచా కాల్చి సంబరాలు జరుపుకోవడం జరిగింది.పరకాల నియోజకవర్గ యుత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి అల్లం శ్రీరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్యామ్, జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కోమల, పరకాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మటి కృష్ణ కాంత్ (నాని) వీరందరూ ఆన్లైన్లో ఓటింగ్ ద్వారా విజయం సాధించారు. ఈ సందర్భంగా పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో సంబరాలు జరుపుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి గారు, ఏఎంసి డైరెక్టర్ దాసరి బిక్షపతి , కౌన్సిలర్ పంచగిరి జయమ్మ, పర్నం మల్లారెడ్డి, అల్లం రఘు నారాయణ, కొత్తపల్లి రవి,లక్కం శంకర్, ఇనగాల రమేష్,పుట్ట రాజు,బొమ్మకంటి చంద్రమౌళి,మంద నాగరాజు,గూడెల్లి సదన్,మచ్చా సుమన్,పసుల విజయ-బద్రయ్య ఏకు రవికుమార్, బొచ్చు మోహన్, సంపత్, నాగుర్ల శ్రీనివాస్, యువజన సంఘం కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకోవడం జరిగింది.

# ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

- అమలు కానీ హామీలతో ప్రజలను వంచించిన రేవంత్ రెడ్ సర్కార్





**చిట్యాల, డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల, టేకుమట్ల, మొగుళ్ళపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బిజెపి నాయకులు బైక్ ర్యాలీని నిర్వహించారు అనంతరం చిట్యాల మండల కేంద్రంలో జరిగిన సమావేశానికి చిట్యాల మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ అధ్యక్షత వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడు నూతల నిషేధం రెడ్డి రాష్ట్ర నాయకులు నాగపురి రాజమౌళి గౌడ్ హాజరైనారు అనంతరం వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు 420 హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరు గ్యారెంటీలను 420 హామీలను అమలు చేయడంలో రేవంత్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గారడి విద్యలతో ప్రజలను వంచిస్తుందని మండిపడ్డారు రైతులను విద్యార్థులను యువకులను మహిళలను మోసం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అరితేరిందన్నారు రిందన్నారు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టి ముఖ్యమంత్రి రేవంత్ మెడలు వంచి ప్రజల పక్షాన పోరాటం చేసి ఇచ్చిన హామీలను నెరవేర్చే దాకా ఉద్యమాలను కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర,జిల్లా మండల ,నాయకులు మోరే రవీందర్ రెడ్డి చెవ్వ శేషగిరి గుర్రం నాగరాజు, తీగల జగ్గయ్య ,గుండ సురేష్, చెక్క నరసయ్య, సయ్యద్ గాలి ఫ్ మైదామ్ శ్రీకాంత్,గోపగని స్వామి, దుగ్యాల రామచందర్ మాచర్ల రఘు ,సదా సదానందం, సారంగాపని పెరుమండ్ల రాజు గుండ మని కుమార్ ,ర్యాకం శ్రావణ్ ,అశోక్ చారి ,వివేక్, మార్త అశోక్ ,అనుపమ మహేష్ బుర్రి తిరుపతి, ఎల్లెటి వెంకన్న నల్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య








**హనుమకొండ ప్రతినిధి: డిసెంబర్ 4 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం నారాయణ గిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను కలెక్టర్ పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో చేపట్టిన తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, ఇతర మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో వాసంతి, డిఆర్డివో మేన శ్రీను, ఎంపీడీవో అనిల్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన గంగాధర ఎస్సై జి.నరేందర్ రెడ్డి



**గంగాధర, డిసెంబర్4(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఖాజాపూర్ నుంచి బుధవారం రోజున గంగాధర మండలంలోని గర్శకుర్తి గ్రామానికి కొత్తపల్లి మండలం ఖాజీపూర్ గ్రామ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నటువంటి రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసి డ్రైవర్ల అయిన కొమ్మూరు ఉదయ్, ఇల్లందుల అరుణ్ కుమార్ మరియు ట్రాక్టర్స్ ఓనర్స్ అయిన ఇల్లందుల సతీష్ , దాసరపు వెంకటేష్ పైన కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై జి. నరేందర్ రెడ్డి తెలిపారు.

# చిట్యాల మండల యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా అల్లకొండ కుమార్



**చిట్యాల, డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో యూత్ కాంగ్రెస్ ఎన్నికలు గత మూడు నెలల క్రితం ఎంతో ఉత్కంఠ భరితంగా పార్టీ బలోపేతం కోసం యువజన కాంగ్రెస్ ను రాష్ట్రంలో పటిష్టం చేయుట కొరకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల ఆదేశానుసారంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి ఆదేశం మేరకు భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆశీస్సులతో ఈ మండలంలో ఉన్నటువంటి యువజనులందరూ యూత్ కాంగ్రెస్ సభ్యులుగా చేరి నా గెలుపుకు నాకు సహకరించిన యువజన కార్యకర్తలకు నాయకులకు మేధావులకు అనుబంధ సంఘాల అధినేతలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు మహిళలకు విద్యార్థులకు అందరికీ మరియు ఈ ఎన్నికల్లో నాకు ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించినటువంటి కాంగ్రెస్ పార్టీ మేధావులకు నాయకులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# మాజీ సర్పంచ్ భౌతికాయానికి నివాళులు





**ఖానాపూరం, డిసెంబర్ 04, (పీసీ డబ్ల్యూ న్యూస్):** ఖానాపూరం మండలంలో కొత్తూరు గ్రామ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ భాష బోయిన చంద్రయ్య బుధవారం రోజు మరణించగా వారి భౌతిక యాన్ని సందర్శించి నివాళులు అర్పించి అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చిన నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండలం మాజీ ఎంపీపీ ప్రకాష్ రావు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాజీ సర్పంచ్ రమ అశోక్ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీను ముఖ్య నాయకులు క్లస్టర్ బాధ్యలు తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట యువజన అధ్యక్షులుగా సందీప్ ఎన్నిక

**నర్సంపేట, డిసెంబర్ 04 (పీసీడబ్ల్యూ న్యూస్):**రాష్ట్రంలో జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో మా నాయకులు నర్సంపేట శాసన సభ్యుల దొంతి మాధవరెడ్డి ఆశీర్వాదంతో నర్సంపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా 3456 ఓట్ల మెజారిటీతో గెలిచిన తుమ్మలపెల్లి సందీప్, విజయం సాధించిన సందర్భంగా సందీప్ కు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ముఖ్య నాయకులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.



# SGPAT నూతన జిల్లా కమిటీ ఎన్నిక

**• డిసెంబర్ 17న జరిగే పెన్షనర్స్ డే విజయవంతం చేయాలి • రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి వీరాస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలిశోజు రామ మనోహర్**







**హనుమకొండ ప్రతినిధి: డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్, తెలంగాణ వరంగల్ జిల్లా శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు కర్రు సుధీర్ బాబు అధ్యక్షతన బుధవారం అసోసియేషన్ కార్యాలయంలో జరుగగా.., పరిశీలకులుగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి వీరాస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలిశోజు రామ మనోహర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో అన్ని యూనిట్ ల కార్యకర్తలకు జిల్లా శాఖలో ప్రాతినిధ్యం వుండాలని చర్చించడం జరిగింది. అలా ఏర్పాటు చేసిన జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే,డైరీ ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. డిసెంబర్ 17 న పెన్షనర్స్ డే కార్యక్రమం తుమ్మ వీరయ్య ఆధ్వర్యంలో కాశీబుగ్గ యూనిట్ లో నిర్వహించుటకు ముందుకు రావటం జరిగింది. ఆ కార్యక్రమాన్ని జిల్లా శాఖ పక్షాన విజయవంతం చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. 2025 డైరీ కి సంబంధించిన ఆవిష్కరణ కార్యక్రమం వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వరంగల్ లో నిర్వహించాలని ,ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ను ట్రెజరీ అధికారులను ఆహ్వానించాలని, దీనికి సంబంధించి అన్ని యూనిట్ ల బాధ్యులతో తేది 17-12-2024 న ఒక కమిటీ వేసుకొని, భాధ్యతలు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు. యూనిట్ బాధ్యులు కూడా ఆర్థికంగా, హార్ధికంగా సహకరించాలని విజ్ఞప్తి చేయడం చేశారు. ఈ సమావేశంలో టి పురుషోత్తం (రాష్ట్ర ఉపాధ్యక్షులు), యస్ రాజయ్య(రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ), యన్ సదానందం జిల్లా ప్రధాన కార్యదర్శి, యన్ రవీందర్ జిల్లా సహ అధ్యక్షులు అన్ని యూనిట్ శాఖలకు సంబంధించిన ముఖ్య కార్యకర్తలు హాజరై,జిల్లా శాఖను పునర్ వ్యవస్థీకరిస్తూ, దిగువ సూచించిన విధంగా ఏర్పాటు చేయమైనది. ఇందులో గౌరవ అధ్యక్షులుగా తుమ్మ వీరయ్య, అధ్యక్షులుగా కర్రు సుధీర్ బాబు, సహ అధ్యక్షులుగా యన్ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా యన్ సదానందం లతో పాటు..

**ఉపాధ్యక్షులు:**

పి షణ్ముఖా చారి(వరంగల్), ఎ వనజ (నర్సంపేట), కె వీర కుమార స్వామి(వరంగల్),ఎం కె మొయినుద్దీన్(వరంగల్), సి హెచ్ అమరేంద్ర స్వామి(వరంగల్), జి సాంబయ్య (వరంగల్), ఎం డి మదార్ సాహెబ్ (కాశి బుగ్గ),ఎ కుమార స్వామి ( ఖిలా వరంగల్ మండలం),డి వెంకటనారాయణ (మట్వాడ)

**కార్యదర్శులు:**

సి హెచ్ సారంగ పాణి ( నర్సంపేట), పి పెద్దయ్య (వర్ధన్నపేట), జి నరసింహా రాములు (ఫోర్ట్ వరంగల్), కె సురేందర్ ( నర్సంపేట), ఎ భిక్షపతి (మట్వాడ), గునిగంటి రమేష్ (గూడూరు), కె మధుసూదన్ రావు (కాశి బుగ్గ),కూనమల్ల సారంగపాణి (పైడిపల్లి)

**ఆర్గనైజింగ్ కార్యదర్శులు:**

కె లక్ష్మయ్య (నర్సంపేట),ఆకుల విజయ్ కుమార్ ( వరంగల్), జి హరి ప్రకాశ్ (వరంగల్), కె డేనియల్ (కాశి బుగ్గ),వి రవీందర్ (ఖిలా వరంగల్ మండలం), కె కుమార స్వామి (మట్వాడ),ఎం వీర శేఖరం (ఫోర్ట్ వరంగల్)లను ఎన్నుకున్నారు.

## మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డిలను కలిసిన కార్పొరేటర్లు





**హనుమకొండ ప్రతినిధి: డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, ప్రజా ప్రభుత్వంగా నిలిచిన సందర్భాన్ని పురస్కరించుకొని హైదరాబాదులో రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని, బుధవారం 62, 63 డివిజన్ కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ - సయ్యద్ రజాలి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 47 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బర్ల రాజ్ కుమార్, పార్టీ శ్రేణులు, తదితరులు, పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం

**• బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి**
**• డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**






**నర్సంపేట, డిసెంబర్ 04, (పీసీడబ్ల్యూ న్యూస్):** నర్సంపేట పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి వర్యులు గంగాపురం కిషన్ రెడ్డి ఆదేశానుసారం, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ సూచన మేరకు నర్సంపేట నియోజకవర్గ యాత్ర ప్రముఖ్ కట్ల రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో ముఖ్యఅతిథిగా బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పాల్గొని కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై చార్జ్ షీట్ ను విడుదల చేయడం జరిగింది.అనంతరం రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని పత్రికా సమావేశం ముఖంగా డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇల్లు లేని నిరుపేదలకు గృహ నిర్మాణానికి ఇందిరమ్మ ఇల్లు పేరిట నాలుగు లక్షల రూపాయలు మంజూరు చేస్తా అని చెప్పారు కానీ ఇప్పటివరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు కావున ఇప్పటికైనా మీరు రాహుల్ గాంధీ ఇందిరా గాంధీ సోనియా గాంధీ ఏ పేరు అయన పెట్టుకో కానీ ఇచ్చిన హామీ మాత్రం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో సపోటా మిర్చి పండించే ఏకైక ప్రాంతం నర్సంపేట నియోజకవర్గం కావున ఈ ప్రాంతంలో గత 40 సంవత్సరాల నుండి క్రితం నుండే ఖానాపురం మండలం అశోక్ నగర్ ప్రాంతంలో మిర్చి పరిశోధక కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ముగ్గురు ఎమ్మెల్యేలు మారిన ఆ హామీ ఎప్పటి వరకు నెరవేరలేదని తెలియజేశారు.నర్సంపేట లో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికై కేంద్ర ప్రభుత్వం జాతియ ఆరోగ్య మిషన్ ద్వారా 67 కోట్లపై చిలుకు నిధులను మంజూరు చేస్తే ఆ ప్రభుత్వం మెడికల్ కళాశాలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ప్రస్తుత శాసనసభ్యులు విఫలమైనారు అని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయినా కూడా ఇప్పటివరకు తెలంగాణ ఎలాంటి అభివృద్ధిని నోచుకోలేదని తెలియజేశారు. మార్పు రావాలి కాంగ్రెస్ రావాలి అని ఓటు వేసి అధికారంలోకి తీసుకు వస్తే పరిపాలన చేయడంలో విఫలమై ఇప్పుడు కొత్తగా విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు అని చెప్పారు. నీళ్లు నిధులు నియామకాల పేరుతో పోరాటాలు చేసి ఆత్మ బలిదానాలు చేసి తెచ్చుకున్న తెలంగాణ దొరల పాలనలో పది సంవత్సరాలు ఇబ్బంది పడిందని అందరూ ఆలోచించి మార్పు రావాలని కాంగ్రెస్ కు ఓటు వేశారు కానీ ఇప్పుడు పరిస్థితి మాత్రం దొంగల పాలనల తయారైపోయింది అని తెలియజేశారు. నర్సంపేటలో కొన్ని సంవత్సరంల నుండి వెనుకబడిన ప్రాంతాలు అయినటువంటి శాంతినగర్, లెనిన్ నగర్, ఇందిరమ్మ కాలనీ పాత నర్సంపేట, తెలంగాణ కాలనీ వీటిని 11 సంవత్సరాల నుండి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు కనీసం వారి బాధలు చూసిన నాయకుడు లేదు ఇదేనా మార్పు రావడం అంటే అని డిమాండ్ చేశారు.అధికారంలోకి వచ్చి సంవత్సరమైనా కూడా ఇప్పటివరకు ఒక్క కొత్త రేషన్ కార్డును కూడా మంజూరు చేయలేదు. ఇదేనా ప్రజలు కోరుకున్న మార్పు అని డిమాండ్ చేశారు.ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం రావడం కోసం ఇచ్చిన రైతు భరోసా హామీని ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే అమలు చేయాలని రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.యువ సంకల్పం పేరిట ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మహాలక్ష్మి పేరిట మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని చేయని యెడల ప్రజల పక్షాన భారతీయ జనతా పార్టీ నిలబడి ప్రభుత్వాన్ని మెడలు వంచి నిలదీస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నరసింహారాములు, నర్సంపేట కాంటెస్టెంట్ అభ్యర్థి కంభంపాటి పుల్లారావు, జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్ మరియు అజ్మీర శ్రీనివాస్ జిల్లా కార్యదర్శి గుడిపూడి రాధాకృష్ణ ఎస్టీ మోర్చ జిల్లా అధ్యక్షులు బానోత్ వీరన్న జిల్లా అధికార ప్రతినిధి మల్యాల వినయ్ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, దళిత మోర్చా జిల్లా కో కన్వీనర్ కూనమల్ల పృధ్వీరాజ్, నియోజకవర్గ యాత్ర సహాప్రముఖ్ తాడుక వినయ్ నర్సంపేట పట్టణ కౌన్సిలర్లు జుర్రు రాజు యాదవ్ మరియు బోడ బోల్యా నాయక్, నర్సంపేట రూరల్ మండల అధ్యక్షులు గంగిడి మహేందర్ రెడ్డి, నల్లబెల్లి మండల అధ్యక్షులు బొద్దిరెడ్డీ ప్రతాప్ రెడ్డి, దుగ్గొండి మండల అధ్యక్షులు నేదురు రాజేందర్, చెన్నరావుపేట మండల అధ్యక్షులు దుంకదువ్వ రంజిత్, నెక్కొండ మండల అధ్యక్షులు నాయిని అశోక్, ఖానాపురం మండల అధ్యక్షులు ఆబోతు రాజు జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు వివిధ మోర్చాల నాయకులు సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు మండల నాయకులు, యువ మోర్చ నాయకులు పార్టీ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలో రికార్డులు భద్రమేనా....?

**• పగలగొట్టిన తాళాన్ని ఎందుకు వాడుతున్నారు.....? • అందులో ఆంతర్యం ఏమిటో గ్రామస్తులకు అంతు చిక్కని ప్రశ్నగా మారింది..?**







**రామడుగు,డిసెంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలంలోని గోపాల్ రావు పేట గ్రామపంచాయతీ కార్యాలయానికిపగలగొట్టిన తాళాన్ని ఎందుకు వాడాలి అసలు గ్రామపంచాయతీలో ఉన్న రికార్డులు భద్రమేనా అంటూ గ్రామంలో జనాలు గుసగుసలాడుతున్నారు.గతంలో సైతం ఈ గ్రామపంచాయతీలో టేకు కట్టెలు సైతం మాయం చేశారని,కొద్దిరోజుల క్రితం ఎవరో ఎత్తుకెళ్లారని గ్రామంలో జనాలు గుసగుసలాడారు. మరి ఇంతటి తతంగం గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక అధికారి, కార్యదర్శి దీనిపై దృష్టి సారించకపోవడం పట్ల గ్రామస్తులకు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మరి ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి గ్రామపంచాయతీ గదికి ప్రత్యేక తాళాన్ని, సీసీ కెమెరాలను పనిచేసే విధంగా చేయాలని కోరుతున్నారు.



# జాతీయస్థాయి బాక్సింగ్ అండర్- 19కి ఎంపికైన విద్యార్థి చందనను అభినందించిన ఎమ్మెల్యే శ్రీ కేఆర్ నాగరాజు





**హనుమకొండ ప్రతినిధి: డిసెంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే నివాస క్యాంప్ కార్యాలయం నందు 14వ డివిజన్ ఎనుమాముల సుందరయ్య నగర్ గ్రామానికి చెందిన యాట చందన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ అండర్ 19 బాక్సింగ్ కాంపిటీషన్లో గోల్డ్ మెడల్ సాధించి నేషనల్ కు ఎంపికైన సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు చందన ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసి పోటీలకు వెళ్లేందుకు క్రీడా సామాగ్రి తో పాటు నా వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇలాగే పట్టుదలతో పోటీ చేస్తూ అంతర్జాతీయ స్థాయిలో వెళ్లి ఊరుకు, తల్లితండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని చందన ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ మాజీ సోషల్ మీడియా రాష్ట్ర కో-ఆర్డినేటర్ అడుప మహేష్, సుందరయ్య నగర్ గ్రామ పార్టీ అధ్యక్షులు త్రికొవెల శ్రీనివాస్, యాట వీరస్వామి, డివిజన్ యూత్ నాయకులు నీలం రాజేష్, దేశరాజు వెంకటేష్ సంఘర్ష్ఫోయిన, రాజేష్ ఖన్నా, మండల నాగరాజు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ ఏఎన్ఎం మృతి

**రామడుగు, డిసెంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం గుండి గ్రామానికి చెందిన చెరుకు సమ్మక్క 35 అనే మహిళ కరీంనగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఎన్ఎం స్టాఫ్ నర్స్ విధులునిర్వర్తిస్తున్న సమయంలోనే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన వార్త కుటుంబ సభ్యులకు సరైన కాలంలో సమాచారం అందించలేదని కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపారు. సమ్మక్క మృతి పై గ్రామస్తులు కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

